# ఇప్పటికీ భూమి గుండ్రంగానే ఉంది



## బులుసు-జీ-ప్రకాష్

"ఏమోయ్ సిద్ధాంతీ! ఎక్కడికి బయల్దేరేవేమిటి? వివరాలన్నీ చెప్పవయ్యా!"

"ఓహో అవధాన్లా! శేన్నాళ్లకి దర్శనం. విశేషాలేమిటోయ్? ఇద్దరం విజయనగరంలో కలిశామే! ఇది జంక్షన్ కదా! నువ్వే ట్రెయిన్‌లో దిగేవు. ఎక్కడికెళుతున్నావు ఏమిటి కథ?"

"గజపతినగరంనుంచి విశాఖపట్నం వెళుతూ కాఫీచుక్క తాగుదామని ప్లాటుఫారంమీద దిగేనోయ్! ఇంతట్లో నువ్వు కనబడ్డావ్! నిన్ను చూడగానే నేను కాఫీ తాగేసినట్లే అయింది. ఆс! ఇక నువ్వెక్కడికెళుతున్నావో కాస్త విడమర్చి చెప్పు!"

"నువ్వు గజపతినగరంలో బయల్దేరి విశాఖపట్నం వెళుతూంటే, నేను విశాఖపట్నంలో బయల్దేరి, గజపతినగరం పోతున్నాను ఇంతే మనిద్దరికీ తేడా! ఏదీ చిన్న పొడుంపట్టు."

"ఇదుగో కానీ,- హాయిగా పట్నంలో ఉండక, మా పల్లెటూరు వెళుతున్నావేమిటయ్యా?"

"ఆ మాత్రం తెలీదూ సిద్ధాంతీ! నాకు పట్నవాసం అంటే విసుగు! నేను ప్రతిరోజూ రేడియో వినడం, బీచి కెళ్లడం, సినిమా చూడ్డం మొదలైన ఎన్నో విధాల విలాస జీవితానికి అల వాటు పడ్డాను. కానీ రాను రాను ఆ బతుకు నాకు అసహ్యం వేసిందయ్యా! ఇరుకైన ఇంట్లో బస. అందులోను నేనున్నది ఒకే ఒక గదిలో! అద్దె మాటంటావా? యాభై రూపాయలు మాత్రమే! మునిసిపాలిటీవాళ్లు మన పాలిటి యమదూతలనుకో! వాళ్ల చెత్తంతా అక్కడే స్టాకుంటుంది. కంపు భరించలేక ముక్కు బద్దలైపోతోంది. నేనున్న యింట్లో మరో వాటాలో మా ఇంటి యజమాని సకుటుంబ సమేతంగా ఉంటున్నాడు. అతని కిద్దరాడపిల్లలు. రాత్రి పదిగంటలకి శయనిద్దామంటే. అమ్మాయిలిద్దరూ డ్యాన్సులు ప్రారంభిస్తారు. అంచేత నా పవళింపుసేవ మానుకుని, తెల్లవార్లూ జాగరణసేవ చెయ్యవలసి వస్తోంది. ఏమైనా పల్లెల్లో ఉన్న సుఖాలు పట్నాల్లో ఉండవయ్యా! పల్లెటూరి వాతావరణం అత్యంతా రోగ్యకరం. నాల్రోజుల పాటు ఏటొడ్డు నైనా పడుకోవచ్చు. ఒక్కటేన్లె కదా! రెణ్ణెల్లు సెలవుపెట్టి గజపతి నగరం పోతున్నాను. రెండు నెలలూ గడిచేక మళ్ళీ పట్నం వస్తే వస్తాను. లేకపోతే అక్కడే సెటిల్ అయి పోతాను. మాటల సందర్భంలో నీ సంగతి అడగడం మరచాను. ఇంతకీ నువ్వేపనిమీద విశాఖపట్నం వెళు తున్నావో చెప్పేవుకావు?"

"అదేమిటవధాన్లూ! పల్లెటూళ్లలో పరిస్థితులు బావులేక, అంతమందీ పట్నాలు జేరుతూంటే, ఎందుకంటా వేమిటి? ఏదో స్వర్గం అనుకున్నావ్ కాబోలు గజపతినగరం. ఒకటో నంబర్ నరకం! అక్కడుండే ఇరుగు పొరుగుల పశువులు సరిగా మా యింటి వాకిట్లోనే పేడకుప్ప వేస్తాయ్! వాళ్లు పశువుల విషయంలో రవంతైనా శ్రద్ధ వహించరు. ఒట్టి పశువులు! ఏమైనా అంటే కొట్టడానికి సిద్ధమౌతారు. మనం అక్కడ తెల్లగా బట్టకడితే చాలు, రాత్రి కల్లా ఆ బట్ట మాయం! గిన్నెలూ ముంతలూ మా యింట్లోంచి ఎన్ని కొట్టేశారో చెప్పలేను. చెప్తే నమ్మవు గానీ అవధాన్లూ! దుక్కలాంటి ఇత్తడి చెంబు పట్టుకుని దొడ్లోకెళ్లానోయ్! వెనకనుంచి ఏ చోరశేఖరుడు వచ్చాడో గాని, అందులో నీళ్లొంపేసి, చెంబు తస్కరించాడు. ఇక యిండ్లకి తలుపు లుంటేగా ధైర్యంగా వుండడాన్కి? లేవు కదా అని వేయిస్తే, ఆ తలుపులు రాత్రికి రాత్రే ఎవరో మస్కా కొట్టేశారు. నేను పడుక్కునే వేళకి, ప్రక్కవాళ్ల ఆవు మూలుగు ప్రారంభిస్తుంది. దాని కేదో రోగం. రోగంతో బాధపడుతున్న

అవు చావడం లేదుగాని మధ్య నేను చస్తున్నాను ! అంచేత నీలాగే నాకూ అసహ్యంవేసి, విశాఖపట్నం పోయి ఏదైనా బ్రాహ్మణార్థం చేసుకుంటూ, హాయిగా బీచిలో సాయంకాలంవేళ విశ్రాంతి తీసుకుందామని వుంది పట్నం లోని సుఖం వుండస్మీ ! వెధవ పల్లెటూళ్ల సంగతి నాకు జ్ఞాపకం చేయకు ! డోకొస్తుంది... అదట్లా వుంచు నువ్వు మా ఊరు పోతానంటున్నావే ? అక్కడ నీ కెవరున్నారు ? ఏ యింట్లో బస ? వివరంగా తెలియజెయ్యి."

"మా బావమరది ఒకడున్నాడయ్యా! అతని కుత్తరం వ్రాశాను. గజపతి నగరంలో తిష్ఠవేసేందుకేమైనా వీలుంటుందా అని. ఆ వూళ్ళో వెంకన్న పంతులుగారిల్లుట. ఆ యింట్లో ఒకాయన కొద్దిరోజులుండి, ఏదో వంక పెట్టి ఎక్కడికో పోతున్నాట్ట. అంచేత ఆ యింట్లో నువ్వుందువుగాని రమ్మని మా బావమరది ఉత్తరం వ్రాశాడు సరేనని బయల్దేరా ఇంతకీ విశాఖపట్నంలో నువ్వెక్కడుందామనుకుంటున్నావ్ ?- అదేమిటయ్యా అలా నవ్వుతావ్ :"

"ఏమీలేదు. విశాఖపట్నం మహారాణీపేటలో సోమనాథశాస్త్రి గారని ఒకాయనున్నాడు చూడు ! అతను మాకు చుట్టం. ఆయన కా వీధిలో ఒక స్వంతిల్లుంది. ఆ యింట్లో ఇన్నాళ్లూ ఒకాయనుండేవాడట. ఆయనకూడా నాలాగే చిరాకేసిందో ఏమిటో ? ఇల్లు విడిచి రెణ్నెల్లపాటు సెలవుపెట్టి ఉడాయించాట్ట. అంచేత ఆ యింట్లో నన్నుండమని ఆ యజమాని ఉత్తరం వ్రాశాడు అక్కడికి పోతున్నాను. అదేమిటోయ్ అలా నవ్వుతావ్? నీకేమైనా నవ్వు రోగం పుట్టిందా ?"

"ఓరి చచ్చుదద్దమ్మా ! ఆ వీధిలో సోమనాథశాస్త్రిగారింట్లో వుంటున్నది నేనేనయ్యా ! గొప్ప టోపీలో పడ్డావే ! ఇక నువ్వు తిన్నగా మీ ఊరికి దారి తియ్యి. ఇద్దరం కలిసేపోవచ్చు !"

"ఓరి వెర్రి వెంగళప్పా ! నువ్వు చెప్పిన వెంకన్న పంతులుగారింట్లో ఉంటున్నది నేనేనయ్యా! ఇక తిన్నగా విశాఖపట్నం దయచెయ్యి. సరే టిక్కెట్లు మార్చేసుకుందాం. నీ దిట్లా పారెయ్ !"

